శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

# చెత్త డంపుగా మారిన ఆయుర్వేద వైద్యశాల



**కోవూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త :** గత 50 సంవత్సరాలుగా ఎంతోమందికి ఆయుర్వేద వైద్య సేవలు అందించిన వైద్యశాల ప్రస్తుతం చెత్త వేసే డంపింగ్ యార్డ్‌గా మారింది. ఒకవైపు పంచాయతీ పరిశుభ్రతపై నిర్వహిస్తున్న ప్రస్తుత నేపథ్యంలో ఎంతోమందికి వైద్యసేవలు అందించిన ఈ ప్రాంగణం మరలా చెత్త డంపింగ్‌గా మారిపోయింది. ఈ సువిశాల ప్రాంగణంలో నూతన ఆయుర్వేద వైద్య సేవలు అందించాలని ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా నేటికీ అవి మంజూరైన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఈ వైద్యశాల చుట్టుపక్కల ప్రాంతాల వారికి చెత్త వేసే డంపింగ్‌గా మారిపోయింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించిన నూతన ఆయుర్వేద వైద్యశాల నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## బిర్సా ముండా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను సాధించండి

### విద్యార్థులకు బహుమతులు అందించిన మేయర్ స్రవంతి జయవర్ధన్




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** గిరిజన యోధుడు బిర్సా ముండా పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా జీవితాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పిలుపునిచ్చారు. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పగుడి సమీపంలోని గుర్రం బాబయ్య కళ్యాణ మండపంలో వ్యాస రచన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, బిర్సా ముండా, వెన్నెలకంటి రాఘవయ్యల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా మేయర్ స్రవంతి జయవర్ధన్, ఐ.టి.డి.ఏ స్టేట్ జాయింట్ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఉలవపాడు జెడ్పీటిసీ అరుణ, ఎన్.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు పులి చెంచయ్య లు పాల్గొన్నారు. అతిథులను కార్యక్రమ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరిజన యోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర పై నగర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు గతవారం వ్యాసరచన పోటీలను నిర్వహించామని తెలిపారు. పోటీలకు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు 350 మంది పాల్గొని తమలోని సృజనాత్మకతను ప్రదర్శించారని సంతోషం వ్యక్తం చేశారు వారి నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విజేతలను ఎంపిక చేశామని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదిగేందుకు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయని మేయర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గిరిపుత్ర ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలని మేయర్ ఆకాంక్షించారు. అనంతరం ఫస్ట్ ప్రైజ్ డి కార్తీక్ 10,000/-, సెకండ్ పి.లక్ష్మి 5000/- మూడో ప్రైజ్ కే గాయత్రి 2500/- విద్యార్థిని విద్యార్థులకు డిక్షనరీలు, నోటు పుస్తకాలు, ప్రశంసా పత్రాలను అతిథులు ప్రదానం చేశారు.

## జ్వరాలతో ఆల్లాడుతున్న గ్రామాలు..పత్తాలేని ఆరోగ్య సేవలు

### రాపూరులో అధ్వానంగా పారిశుధ్యం

**రాపూరు, డిసెంబరు1, ప్రభాతవార్త** రాపూరు మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు జ్వరాలతో ఆల్లాడిపోతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం తుపాన్ కారణంగా మారిన వాతావరణంతో వైరల్ ఫీవర్‌లు ఎక్కువగా వున్నట్లు తెలుస్తుంది. పెద్ద ఎత్తున ప్రజలు రాపూరులోని ప్రవేటు ఆసుపత్రిలతో పాటు, గూడూరు, నెల్లూరులోని వైద్యశాలలకు చికిత్స నిమిత్తం తరలి వెల్లి వేలాది రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. జ్వరాలు వచ్చిన వారికి తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు వచ్చి భాదపడుతున్నారు. మండలంలో ఈ విధంగా ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్న జ్వరాలు ఆదుపుచేయాల్సిన వైద్య సిబ్బంది మండలంలో ఎటువంటి ప్రత్యేక వైద్యశిభిరాలు శిభిరాలు నిర్వహణ వంటి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు మండల కేంద్రమైన రాపూరులో పారిశుధ్యం లోపించండంతో వ్యాధులు ప్రభలుతున్నాయి. వీటికి తోడు రాపూరులో పందులు, కుక్కలు, కోతులు ఎక్కువై పోవడం, అవి తరచూ ప్రజలపై దాడులు నిర్వహిస్తున్నాయి. వీటి కట్టడికి పంచాయితీ పాలకులు, అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, జిల్లా పంచాయితీ అధికారి స్పందించి రాపూరు మండలంలో జ్వరాల ఆదుపుకు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిభిరాలు నిర్వహించడంతో పాటు, ప్రజలకు కోతులు, కుక్కలు, పందులు బెడద నుండి విముక్తి కల్పించి, పట్టణంలో పారిశుధ్యం పనులు నిర్వహించి వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## సోమశిల నీటిమట్టం




**అనంతసాగరం, డిసెంబర్1, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 6919 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 69.628 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 150, ఎన్ఎఫ్‌సికి 4600, పెన్నా డెల్టాకు 1800, కండలేరు వరద కాలువకు2000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.434 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# ఆధిపత్యం కోసమే హిజ్రా హత్య : హిజ్రా హాసిని హత్య కేసు ఛేదించిన పోలీసులు



**నెల్లూరు క్రైమ్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** జిల్లాలో సంచలనం రేపిన హిజ్రా నాయకురాలు హాసిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. హిజ్రాలలో ఉన్న రెండు గ్రూపుల మధ్య ఆధిపత్యమే ఈ హత్యకు దారి తీసినట్లు, అందుకు కొందరు పాత నేరస్తులు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. చిన్న చెరుకూరు గ్రామానికి చెందిన మాణికల హాసిని (33) హిజ్రాల సంఘానికి నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. కేవలం నెల్లూరు నగరం మాత్రమే కాకుండా రాయలసీమలోని అన్ని జిల్లాలు, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయచూరు, ధార్వాడ్ తదితర ప్రాంతాల్లోని హిజ్రాలందరికి హాసిని నాయకిగా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు ఇదే తరహాలో హిజ్రాల అందరికీ నాయకురాలిగా వ్యవహరిస్తున్న రాయపనేని అలేఖ్య కు, హాసినికి మధ్య విభేదాలు నెలకొన్నాయి. తనకంటే చిన్నది అయిన హాసిని ఎదగడం సహించలేకపోయిన అలేఖ్య సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నది. ఇదే సమయంలో మరో రెండు హిజ్రా గ్రూపులకు నేతృత్వం వహిస్తున్న సులోచన, షీలాలకు హాసినితో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో అలేఖ్యతో జత కూడిన సులోచన, షీలాలు హాసిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయంలో తమకు సహకరించాలని సుందరయ్య కాలనీకి చెందిన చింతల భూపతిని కోరగా అతను తన స్నేహితులతో కలిసి హాసినిని చంపేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో నవంబర్ 26వ తేదీ విడవలూరు మండలం పార్లపల్లి లోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు ముగించుకుని కారులో వస్తున్న హాసినిని కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ పాస్ వద్ద తమ వాహనాలతో అడ్డగించి 15 మంది ముద్దాయిలు అతి దారుణంగా హాసినిని చంపి వేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితుల్లో 12 మందిని అరెస్టు చేశారు. అరెస్టు కాబడిన ముద్దాయిలు: ఇల్లపు వంశీకృష్ణ (నాలుగో మైలు), మొలతాటి రాము (మార్టూరు మండలం, బాపట్ల జిల్లా), తాండ్ర కార్తీక్ (అల్లీపురం), అంబూరు సుబ్రమణ్యం (4వ మైలు), షేక్ మస్తాన్ వలి (4వ మైలు), కొత్త పార్టీ వెంకటాద్రి (నాల్గవ మైలు), కొత్తపల్లి రాజేష్(కిసాన్ నగర్), గురునాథం నరసింహ (4వ మైలు), నెల్లూరు వంశీ (జేజే పేట, ఇందుకూరుపేట మండలం), ఊటుకూరి శివ (బోడి గాడి తోట), రాయపనేని అలేఖ్య ( జనార్దన్ రెడ్డి కాలనీ), చింతల భూపతి (సుందరయ్య కాలనీ). మరో ముగ్గురు నిందితులు అరెస్టు కావాల్సి ఉందని, వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్ సీఐలు సురేంద్రబాబు, సుబ్బారావు, వేణు లతోపాటు వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి సిహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# విపత్తను ఎదుర్కొనేందుకు సిబ్బందికి విధుల కేటాయింపు : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఆదేశాల మేరకు విపత్తు సహాయక బృందాలను ఆదివారం ఏర్పాటు చేసి తక్షణమే విధుల్లో హాజరుకావాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఉన్న ప్రధాన చెరువులు పూర్తిగా నిండిపోయి ఉన్నందున వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నాతాధికారులు, ఇండోర్ మరియు ఔట్డోర్ సిబ్బంది, వార్డు సచివాలయం కార్యదర్శులు అందరూ అప్రమత్తంగా ఉండి తమ తమ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించి నిర్దేశించిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది అందరికీ ముందస్తుగా జారీ చేసిన సెలవులను రద్దు చేస్తూ ప్రతి ఒక్కరు నగరపాలక సంస్థకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. డిసెంబర్ మూడో తేదీ వరకు షిఫ్టులలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. విపత్తు సహాయక చర్యలలో ఆరు మంది జూనియర్ అసిస్టెంట్ లను, 13 మంది సహాయకులను బృందాల వారీగా విధులు కేటాయించారు. భారీ వర్షాలకు ముంపు ప్రాంతాల్లోని వరద బాధితులు తమ సమస్యలను 9494018118 నెంబరుకు వాట్సప్ ద్వారా లేదా 0861-2356777 అండ్ 0861-2316777 హెల్ప్ లైన్ నెంబర్లకు కాల్ చేసి తెలియజేయాలని కమిషనర్ సూచించారు.

# దళితుల భూములు లాక్కునే యత్నం

## సర్వే పేరిట భూములు మార్పిడి...న్యాయం చేయాలని వేడుకోలు





**వరికుంటపాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త : ఎన్నో** సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగుచేసుకుంటుండగా ఇప్పుడు కొంత మంది ఆభూములు మావి అంటూ సర్వేల పేరిట లాక్కునే యత్నం చేస్తున్నారంటూ మండల కేంద్రమైన వరికుంటపాడు ఎస్సీ కాలనీ కి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తెలిపిన వివరాల మేరకు వరికుంటపాడు రెవిన్యూ పరిధిలో ఎస్సీ కాలనీ కి చెందిన గొల్లపల్లి జయరావు, గోచిపాతల సువార్తమ్మ, గోచిపాతల చిన మాలకొండ య్య, గోచిపాతల మాల్యాద్రి ,చెనికల నాగమ్మ, గొల్లపల్లి గాంధీ లకు సర్వే నెంబర్ 204 లో ఒక్కో రికి 2.00 ఎకరాల చోప్పున ప్రభుత్వం భూమిని కేటాయించి, అప్పుడే సర్వే కూడా చేయించి, హద్దులు చూపించిందని తెలిపారు. ఆ భూమిని అప్పటి నుండి అందులో పంటలు పండించుకుం టున్నామన్నారు. అలాగే రైతులందరూ దళితులు కావడంతో ఆ భూమిలో ప్రభుత్వమే విద్యుత్ సౌకర్యం కల్పిం చడమే కాక, అందులో బోరును సైతం ఉచితంగా వేయించారు. ఇప్పుడు ఓ కొంతమంది ఆ భూములు తమవి అంటూ అడ్డగోలుగా సర్వేయర్ లను ఆశ్ర యించి అందులో కనీసం ప్రస్తుతం సాగులో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వకుండానే సర్వే చేయించడమే కాక ,హద్దులను చూపుతూ రాళ్లను సైతం పాతడం ఆపై దళిత రైతులకు సంబందించిన బోరుకు సైతం తాళాలు వేసారు. విషయం తెలుసుకున్న దళిత రైతులు ఇదేమిటి అని ప్రశ్నిస్తే ఈ భూమి మాది అంటూ నిర్లక్ష్యంగా సమాధానా లు చేప్తుతున్నారని రైతులు ఆవేదన చెందుతు న్నారు. ఎన్నో ఏళ్ళుగా ఈ భూమిని మేము సాగుచేసుకుంటున్నామని ఇప్పుడు వాళ్ల ఆ భూమిని లాక్కుంటే తాము ఏమి చేయా లంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు. కనీసం అధికారులు కూడా తమకు సమాచారం ఇవ్వకుండా ఇలా సర్వే చేయడం ఏంటి అంటూ ప్రశ్నిస్తున్నారు. దళితులే కదా ఏమి చేస్తారులే అని ఇలా చేస్తు న్నారంటూ వారు ఆవేదన చెందుతున్నారు. కాబట్టి రెవిన్యూ అధికారులు స్పందించి తమ భూములను కాపాడి, తమకే ఇప్పించాలని ఆ రైతులు కోరు తున్నారు. ఈ విషయం పై తహశీల్దార్ హేమంత్ కుమార్ ను వివరణ కోరగా ఆ విషయం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.



# మినీ పద్మవ్యూహంలా మినీ బైపాస్ రోడ్డు..

## ఆరు దాటితే ట్రావెల్ బస్సుల హోరు షురూ..

## వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం..

## పట్టించుకోని పోలీసు యంత్రాంగం










**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 1 ప్రభాతవార్త** ఒకప్పుడు నగరంలోని ట్రాఫిక్ రద్దీని తట్టుకోలేక ద్విచక్ర వాహనదారులు, కార్లు ఉపయోగించేవారికి మినీ బైపాస్ రోడ్డు ఒక ప్రత్యామ్నాయ మార్గంగా సులభంగా గమ్యస్థానానికి చేరుకునే విధంగా ఉండేది. కానీ ప్రస్తుతం ట్రావెల్ బస్సుల పుణ్యమా ని మినీ బైపాస్ రోడ్డు ఒక మినీ పద్మవ్యూహం ల మారిపోయింది. మరీ ముఖ్యంగా సాయంత్రం 6 గంటలు దాటితే ఈ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. హరినాథపురం సర్కిల్ నుండి మైలు దూరంలోని ఆత్మకూరు బస్టాండ్ చేరుకునేందుకు అరగంట సమయం పడుతుంది. ఈ మార్గంలో ట్రావెల్ బస్సులను నిలుపుదల చేసినప్పుడు నుండి ట్రావెల్ ఏజెన్సీల కార్యాలయాలు ఏర్పడి దూరప్రాంత ప్రయాణికులను తీసుకెళ్లే ట్రావెల్ బస్సులతో ట్రాఫిక్ కిక్కిరిసి ఉంటుంది. దూరప్రాంత ప్రయాణి కుల కోసం ట్రావెల్ బస్సులు నిలపాల్సిన అవసరం ఉంది. అయితే ఒక బస్సు వెళ్లిన తర్వాత మరొక బస్సుని కార్యాలయం వద్దకు వచ్చే విధంగా ఏర్పా టు చేసుకోవాల్సిన ట్రావెల్ బస్సులో నిర్వాహకులు అందుకు విరుద్ధంగా ఒకే సమయంలో ఐదారు బస్సు లు మినీ బైపాస్ రోడ్డుపై నిలిపి ఉంచుతున్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించాల్సిన పోలీస్ సిబ్బంది ఆ పరిసర ప్రాంతాల్లో మచ్చుకైనా కానరారు. రోడ్డుకి అడ్డంగా నిలిపిన వరుస బస్సులతో ట్రాఫిక్‌కి ఏర్పడుతున్న అవాంతరాలను ఎవరైనా వాహనదారులు ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకుల వద్దకు తీసుకెళ్తే వారు దురుసుగా ప్రవర్తిస్తున్న సందర్భాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. రాత్రి 10 గంటల వరకు ఈ మార్గంలో ఇదే పరిస్థితి నెలకొంది. కేవలం ప్రయాణికుల కోసమే బస్సులు నిలిపారని అనుకుంటే అది పొరపాటే. ప్రయాణికులతో పాటు కార్గో నిర్వహణ కూడా ఈ ఏజెంట్లు నిర్వహిస్తుండడంతో ఇతర ప్రాంతాలకు బుక్ చేసిన వివిధ సామాగ్రిని బస్సుల్లో నింపే వరకు బస్సులను నిలిపి ఉంచే పరిస్థితి నెలకొంది. ఈ ట్రావెల్ బస్సుల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను స్థానికులు పోలీస్ శాఖ దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ నియంత్రణ చర్యలు ఆశాజనకంగా లేవని ఆరోపణలు ఉన్నాయి.

**ఫుట్ పాత్‌ల ఆక్రమ** మినీ బైపాస్ రోడ్డులో గతంలో నగర సుందరీకరణలో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో అధికారులు ఫుట్ పాతుల నిర్మాణాన్ని చేపట్టారు. పాదాచారులు ఈ మార్గం వెంబడి నడిచేందుకు వీలుగా వీటి నిర్మాణాన్ని దుకాణాల ముందు ఏర్పాటు చేశారు. అయితే ఆయా దుకాణాల వారు, మరో వైపు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు ఈ ఫుట్ పాత్‌లను ఆక్రమించడంతో పాత చర్ల రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరోక్షంగా ఇక్కడ ట్రాఫిక్ రద్దీ ఏర్పడడానికి ఇది కూడా కారణమనే చెప్పాలి. నగరపాలక సంస్థ అధికారులు ఈ ఫుట్ పాత్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇలా ఓవైపు పోలీస్ శాఖ, మరోవైపు మున్సిపల్ శాఖ వెరసి మినీ బైపాస్ రోడ్డులో ట్రావెల్ బస్సుల ఆగడాలకు, తద్వారా ఏర్పడే ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని నగరవాసులు విమర్శిస్తున్నారు.



## చెరువులను తలపిస్తున్న పొలాలు



**విడవలూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** గత నాలుగు రోజుల నుండి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పెంగల్ తుఫాన్‌గా మారి భారీ నుండి అతి భారీ వర్షాలు కురవడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో సుమారు 15 శాతం వర్షపాతం నమోదైంది. విడవలూరు ఇందిరమ్మ కాలనీ,అన్నా రెడ్డిపాలెం గిరిజన, రామచంద్రపురం కాలనీలలో వర్షపు నీరు నిలిచి పోయినాయి. దీంతో ఆ కాలనీ వాసులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు విష పురుగుల మధ్య అనేక జీవిస్తూ అగచాట్లు పడుతున్నామని వాపోయారు. మండల అధికారులు తమ కాలనీలపై చొరవ చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నో సండే, ప్రజా సేవేలో కార్యదర్శి



**విడవలూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రం గ్రామపంచాయతీ పరిధిలో పెన్షన్ దారులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంపిణీ చేయడం జరిగింది.అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అధికారులకు ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ముందు రోజే పెన్షన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. మొదటిరోజు పెన్షన్లు పొందని వారిని సచివాలయం కు పిలిచిన బిట్ 2 కార్యదర్శి హరి ప్రసాద్ నో సండే అంటూ సచివాలయముకు చేరుకుని పెన్షన్లు అందజేశారు. పలువురు ఆదివారం కూడా సచివాలయం ఉందా అని ఆశ్చర్యపోయారు. వర్షం,సెలవు దినములు లెక్కచేయకుండా కార్యదర్శి ప్రజా సేవలను అందించడం చూసిన ప్రజలు అభినందించారు.

## ఎడతెరిపి లేకుండా వర్షం

**బిట్రగుంట,డిసెంబర్ 1,ప్రభాతవార్త:** బోగోలు మండలంలో ఆదివారం ఫెంగల్ తుఫాన్ ప్రభావం వల్ల ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది.దీంతో చెరువులు అన్ని జలకళ తో ఉట్టిపడుతున్నాయి.ఈ వర్షం ఇలాగే కురిస్తే చెరువులకు ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.కాగా శనివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాల వల్ల పలు గ్రామాలలో పల్లపు ప్రాంతాలు జలమయం అయి జనాజీవనానికి అంతరాయము కలిగింది.విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గూడూరు జంక్షన్ లో తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తుండుటంతో రైల్వే శాఖ అప్రమత్తం అయింది.

## బీకేఎంయూ నూతన కమిటీ ఏర్పాటు




**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని రాళ్లమిట్ట అరుంధతివాడలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీకి అధ్యక్షులుగా ఎన్‌పీ పోలయ్య, సహాయ కార్యదర్శిగా కె. శ్రీను, టి. కరుణ, సీహెచ్ మణెమ్మలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎన్. రమణయ్య, ఉపాధ్యక్షులు డి. కామేశ్వరరావులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన కమిటీ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు లక్ష్మయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## ఆస్పత్రికి వెళ్లి పించన్‌దారునికి పింఛన్ పంపిణీ



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా పింఛన్ పంపిణీ కార్యక్రమం మాత్రం యథావిధిగా కొనసాగింది. ఈ నేపథ్యంలో కోవూరు మండలం లేగుం టపాడు గ్రామానికి చెందిన పఠాన్ అహ్మద్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు లేగుంటపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుజాత ప్రత్యేకంగా చొరవ తీసుకుని వర్షంలో సైతం ఆస్పత్రికి వెళ్లి ఆ వృద్ధునికి పింఛన్ పంపిణీ చేశారు. దీంతో ఆమెను ఎంపీడీవో, ఇతర అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

## కొనసాగుతున్న అయ్యప్పల అన్నప్రసాద వితరణ



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని నాగవరపమ్మ దేవస్థానంలో కార్తీక మాస పర్వదినం సందర్భంగా ప్రారంభమైన అయ్యప్పల అన్న ప్రసాద కార్యక్రమం ఆదివారం ని రాటంకంగా కొనసాగింది. అయ ్యప్ప సేవా సమాజం ఆధ్వ ర్యం లో మల్లికార్జున్‌రెడ్డి, వారి మిత్ర బృందం ప్రత్యేకంగా చొరవ తీసు కుని దాతల సహకారంతో నిర్వహి స్తున్న ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా 30వ రోజుకు కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో రుత్వికులు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా చెన్నైకు చెందిన హజరత్‌రెడ్డి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

## వైభవంగా అమావాస్య పూజలు



**కోవూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో అమావాస్య ఆదివారం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## వరద ప్రవాహాల వద్ద ప్రజలు అప్రమత్తంగా వుండాలి



**రాపూరు,డిసెంబరు1ప్రభాతవార్త :** వరద ప్రవాహాలు వచ్చే వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాపూరు ఎస్‌ఐ యం.వెంకట రాజేష్ కోరారు.ఫెంగన్ తుపాన్ కారణంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులోని కోండేరు,ఇతర నీటి ప్రవాహాల వద్ద ఆయన ఆదివారం సర్కిల్ ఇనస్పెక్టర్ విజయ కృష్ణ సూచనలతో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కోండేరు,ఇతర నీటి ప్రవాహ ప్రాంతాలలో పలువురు యువకులు సరదాగా ఈత కొట్టుతూ వుండటం గమనించిన ఎస్‌ఐ వారిని మందలించి ప్రవాహం నుండి బయటకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ప్రవాహం తుపాన్ సమయంలో ఒక్కసారిగా వస్తుందన్నారు. ఆ సమయంలో నీటిలో వుంటే వారు కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు నీటి విషయంలో జాగ్రత్తగా వుండాలని వారికి అవగాహన కల్పించారు. ఈయన వెంట పలువురు పోలీసు సిబ్బంది వున్నారు.

## భారీవర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
## అప్రమత్తమైన విద్యుత్ అధికారులు

**కావలిరూరల్, డిసెంబర్01 ప్రభాతవార్త :** కావలిరూరల్ మండలం ఆముదాలదిన్నె గ్రామసమీపంలో రహదారిపై తుఫాన్‌కారణంగా భారీ వర్షాలకు మూడు విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఆదివారం ఉదయం పడిపోవడంతో ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారులకు ఆముదాలదిన్నె గ్రామస్తులు సమాచారం ఇవ్వగా వెంటనే కావలిరూరల్ మండల విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులురెడ్డి అప్రమత్తమై తన సిబ్బందితో కలిసివెళ్లి క్రేన్లు, ప్రొక్లెయిన్‌లు మూడు భారీ వాహనాలతో రోడ్డుకు అడ్డంగా పడిఉన్న మూడు విద్యుత్ స్తంభాలను ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పునరుద్ధరించి విద్యుత్‌ను సరఫరా చేయడం జరిగింది. భారీగాలులతో కూడిన భారీవర్షాన్ని కూడా లెక్కచేయకుండా విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్‌ను సరఫరా చేయడంతో ఆముదాలదిన్నె పరిసర ప్రాంతాలకు తుమ్మలపెంట సబ్‌స్టేషన్, చెన్నాయపాళెం సబ్‌స్టేషన్లకు కూడా విద్యుత్ సరఫరా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసులురెడ్డికి, విద్యుత్ సిబ్బందికి ఆముదాలదిన్నె గ్రామస్తులు మరియు వాహనదారులు అభినందనలు తెలియచేశారు.

## మేకలకాపరిని హత్యచేసిన వ్యక్తి అరెస్ట్ కావలి డిఎస్పీ శ్రీధర్




**కావలి, డిసెంబర్01 ప్రభాతవార్త :** కొండాపురం మండలం గానుగపెంటలో మేకలకాపరి బంకా తిరుపాలును హత్యచేసిన వ్యక్తిని అరెస్ట్‌చేసి అతనివద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డిఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డబ్బు ఆశతో మేకలకాపరి బంకా తిరుపాలును కావడిమల్లి అలియాస్ గురునాథం మాల్యాద్రి కత్తితో హత్యచేశాడన్నారు. పొలంలో పశువులకాపరివద్ద ఉన్న 23 మేకలను అపహరించాడన్నారు. గత నెల 27వ తేది మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో బంకా తిరుపాలును హత్యచేసి అతను మేపుకుంటున్న 23 మేకలను అపహరించాడన్నారు. ఈ మేకల విలువ 2లక్షల 30వేలు ఉంటుందన్నారు. ఈ మేకలను తోలుకుని అగ్రహారం రోడ్డులో పోతుండగా నలుగురు వ్యక్తులు మాట్లాడుకోవడం చూసి వారివద్దకు పోయి డబ్బులుకు ఇబ్బందిగా ఉందిఅని చెప్పి తక్కువ ధరకు మేకలను అమ్ముతానని చెప్పాడన్నారు. వారిలో ఇద్దరువ్యక్తులు గోపి, నవీన్‌లకు చెరొక మేకను అమ్మి 4500లు తీసుకున్నాడన్నారు. మరో వ్యక్తి గోవర్ధన్‌కు అనుమానం వచ్చి తనఫోన్‌లో వీడియో తీశారన్నారు. అది గమనించిన కావడి మల్లి అలియాస్ గురునాథం మాల్యాద్రి భయపడి మేకలను అక్కడే వదిలేసి తప్పించుకుని పారిపోయాడన్నారు. కత్తితో పొడిచిన తిరుపాలు చనిపోయాడని తెలిసి పోలీసులు ముద్దాయికోస వెతుకులాట ప్రారంభించారన్నారు. ఈ విషయం తెలుసుకుని సత్యవోలు విఆర్‌లో వద్ద కావడిమల్లి లొంగిపోయారన్నారు. ఈ కేసులో కలిగిరి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.వెంకటనారాయణ, కొండాపురం ఎస్‌ఐ ఎం.వెంకటరావు, వింజమూరు ఎస్‌ఐ కె.ప్రతాప్, హెడ్‌కానిస్టేబుల్ బి.రమేష్‌కుమార్, కానిస్టేబుళ్లు ఆర్ మహేష్, పి.సుబ్రహ్మణ్యం, యు.రాజశేఖర్, యన్.సురేష్, వింజమూరు కానిస్టేబుల్ యస్‌కె.సుల్తాన్‌బాష, కొండాపురం కానిస్టేబల్ యం.ప్రతాప్, ఏఆర్‌పిసి కె.శ్రీకాంత్‌లు ఈ కేసులో కృషిచేశారన్నారు. ఈ సమావేశంలో కలిగిరి సి.ఐ వెంకటరమణ, కొండాపురం ఎస్‌ఐ వెంకటరావులు పాల్గొన్నారు.

## జవహర్‌భారతి కళాశాలలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం



**కావలిరూరల్, డిసెంబరు01 ప్రభాతవార్త :** కావలిపట్టణంలోని జవహర్‌భారతి డిగ్రీకళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ఆదివారం విద్యార్థిని, విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన మరియు అప్రమత్తతపై పోస్టర్‌మేకింగ్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలు ప్రదర్శించడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనపర్చిన టీమ్స్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు, స్వయంఉపాధికోర్సుల డైరక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి అందించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడారు. ఎయిడ్స్ అంటువ్యాధికాదని, ఎయిడ్స్‌కు చికిత్సలేదని నివారణ ఒక్కటే మార్గమని తెలియచేశారు. యస్‌యఫ్‌సి డైరక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి మాట్లాడారు. ఎయిడ్స్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న రోగులకు మానవత్వంతో చేతనైనంత సహాయ, సహకారాలు అందించాలని తెలియచేశారు. రెడ్‌రిబ్బన్‌క్లబ్ కోఆర్డినేటర్ వి.వసుంధరాదేవి మాట్లాడారు. ఎయిడ్స్ రోగులపట్ల దయ, కరుణ, కనికరం కలిగి ఉండాలని వారిని ద్వేషించరాదని తెలియచేశారు. అనంతరం కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ అవగాహనా నినాదాలు చేయడం జరిగింది. విద్యార్థిని, విద్యార్థులను ఈ కార్యక్రమం నిర్వహించినందుకు విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి అభినందిచారు. ఈ కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్‌క్లబ్ మెంబర్స్ మరియు యన్‌యస్‌యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొనడం జరిగింది.

## వెలుగు అక్రమాల విచారణ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**రాపూరు,డిసెంబరు1ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని వెలుగు కార్యలయంలో 2019 సంవత్సరం జూన్‌నుండి 2024 జూన్ వరకు వివిధ విభాగాలలో జరిగిన అవినితి విచారణపై విచారణాధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఏపి ప్రజా సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక ఆధ్యక్షుడు గద్దల మునెయ్య ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. 2019 నుండి 2024 వరకు జరిగిన వెలుగు అక్రమాలపై తాను గత నెల 11వ తేది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యదు చేయడం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ 9 మంది డిఆర్‌డిఎ అధికారులతో విచారణ కమిటీ వేశారన్నారు. అయితే విచారణకు వచ్చిన అధికారులు అవినితీ అరోపణలు ఎదుర్కోంటున్న వారిని దగ్గర పెట్టుకోని రికార్డులు తనిఖీ చేయడమేమిటని ఆయనప్రశ్నించారు. విచారణ ఎదుర్కోంటున్న వారు తమ కింద స్థాయి సిబ్బందిని తమదైన శైలిలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ ధృష్టికి వచ్చిందని దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యలయంలో మరలా ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట నన్నం మునెయ్య, గిరిజన నాయకులు ప్రసాద్ తదితరులున్నారు.



## శనీశ్వరునికి ప్రత్యేక పూజలు



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ పరిధిలోని పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న శనీశ్వర స్వామికి ఆదివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని రుత్వికులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ అభిషేక కార్యక్రమంలో చుట్టుపక్కల నుంచి భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## నీట మునిగిన నారుమళ్లు



**విడవలూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మండలం అన్నా రెడ్డిపాలెం పంచాయితీ భద్రాచలం గ్రామంలో నారుమళ్లు నీట మునిగినయి పొలంలో విత్తనాలు చల్లి ఐదు రోజులు ఒక్కసారిగా భారీ అతి భారీ వర్షాలు కురవడంతో రైతన్నలకు దుఃఖం మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతులకు నష్టపరిహారంగా లేదా. ఏ విధమైన సహాయం అందిస్తారో అయోమయంగా ఉందని వాపోయారు. నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు కనీసం ఏ అధికారైన పర్యవేక్షించలేదు. ఇక జిల్లా అధికారులు అయినా పట్టించుకోని రైతన్నలకు న్యాయం చేస్తారని కోరుతున్నారు.

## దుర్గాదేవి రూపంలో అంకమ్మ తల్లి

**విడవలూరు, డిసెంబర్ 1, ప్రభాత వార్త :** మండల కేంద్రంలో గ్రామదేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం పూజలు నిర్వహించారు.ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల పండ్లతో అలంకరణ చేశారు. సాయంకాలం అభిషేకం, కుంకుమార్చన పూల అలంకరణ, రాత్రి పల్లకి సేవ, భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు కొర్నాగిరి, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాస చివరి రోజు వేడుకలు



**విడవలూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోశ్రీ గంగా కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో చివరి కార్తీక మాస వేడుకలు భక్తులు ఆలయానికి వందల సంఖ్యలో పాల్గొని కార్తీకదీపం వెలిగించి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివ స్వామి మాట్లాడుతూ కార్తిక చివరి మాస అమావాస్య ఆదివారం సందర్భంగా కొలిఉత్సవం యధాస్థితి దామోదర స్వామిని భక్తులచే కార్తిక జ్వాల సమర్పణ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## విజయవంతంగా ఎన్‌ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్



**వింజమూరు, డిసెంబర్1, ప్రభాతవార్త:** వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ విజయవంతమైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.మాలకొండయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు 200మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 180మార్కులకు ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఈపరీక్షల్లో విజేతలైన వారికి ఈనెల 8వ తేదీన ప్రభుత్వం నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఈ టెస్ట్ మార్క్‌టెస్ట్‌గా ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ సలాం, మహేంద్ర, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరోత్తమ రెడ్డి , జిల్లా సమన్వయకర్త శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అవగాహనతో ఎయిడ్స్ నుంచి రక్షణ




**వింజమూరు, డిసెంబర్1, ప్రభాతవార్త:** సమాజంలోని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగిఎయిడ్స్ నుంచి రక్షణ పొందవచ్చని రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ మాశిలామణి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడం , ఎయిడ్స్ వ్యాధికి కారక హెచ్‌ఐవికి పోరాడడమే లక్ష్యమన్నారు. ఎయిడ్స్ నివారణమాత్రమే మార్గమన్నారు. ఎయిడ్స్ వ్యాధి కలుషిత రక్తం వలన, సూదుల వలన, విచ్చల విడి శృంగారం వలన ఈ వ్యాధి సోకుతుందన్నారు. లారీ డ్రైవర్లు, ట్రక్ డ్రైవర్లు, తాపీ మేస్త్రీలు, చాలాకాలం దూరంగా ఉండి ఆయా ప్రాంతాల్లో అక్రమసంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వలన వస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై జాగ్రత్తలు వహించి దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగామందులు అందజేస్తుందన్నారు. మందులుక్రమం తప్పకుండా వేసుకుంటూ ఆరోగ్యాన్ని , జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## డిబియస్‌లో ఘనంగా ప్రారంభమైన రగ్బీ పోటీలు



**కావలిరూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కావలిలోని డిబియస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2వ రాష్ట్రస్థాయి మినీసబ్‌జూనియర్ అండర్ 12 ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ అద్యక్షుడు మల్లికార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు.. చిన్నపిల్లలకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తే భవిష్యత్తులో క్రీడాకారులుగా రాణించేటటువంటి అవకాశం ఉందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 14 జిల్లాలనుంచి బాల,బాలికలు పోటీలలో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర రకమీ సంఘం ప్రధానకార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. రాష్ట్ర నలుమూలలనుంచి వచ్చిన క్రీడాకారులకు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల బాధ్యులు దామోదర్ ఆయా జిల్లాల రగ్బీ ప్రతినిధులు చంద్రశేఖర్‌రావు, యాసిన్, శంకర్, వంశీ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక మాస చివరి పూజలు



**రాపూరు, డిసెంబరు1ప్రభాతవార్త :** మండలకేంద్రమైన రాపూరులోని పూరాతన రామనాధేశ్వర స్వామి(శివాలయంలో),కార్తిక మాస చివరి రోజు పూజలు భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి వారికి పలు రకాలైన అభిషేకలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రామనాధేశ్వర స్వామి,శ్రీ భ్రమరాంబికా దేవికి ప్రత్యేక పూలాంగి సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోని స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు మద్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని రాపూరు మాజీ సర్పంచ్,మాజీ జడ్‌పిటీసి పిల్లకదుపు శకుంతల,గురునాధం దంపతులు నిర్వహించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు కారంచేటి వెంకటేశ్వర్లు,కారంచేటి రామనాధేశ్వర శర్మలు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## కావలి ప్రజల దాహార్తిని తీర్చిన దాత మాగుంట రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్



**కావలి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** కావలి ప్రజల దాహార్తిని తీర్చిన మంచినీటి ప్రదాత మాగుంట సుబ్బరామిరెడ్డిఅని కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ తెలిపారు. ఆదివారం కావలిరెడ్‌క్రాస్ భవనలో సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అద్యక్షులు తాటికొండ నవీన్ మాగుంట వర్ధంతికి 52వసారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రవిప్రకాష్ మాట్లాడారు. మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలుచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. మాగుంట వర్ధంతి సందర్భంగా తాటికొండ నవీన్ 52వసారి రక్తదానం చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. తాటికొండ నవీన్ మాట్లాడుతూ ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి స్నేహశీలి, విద్యాదాత, మంచినీటిదాత, అపరదానకర్ణుడు, సేవాతత్పరుడు ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లోని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నిస్వా ర్థప్రజాసేవకుడని కొనియాడారు. స్వచ్ఛందసంస్థలకు, రాజకీయనాయకులకు మాగుంట ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా నవీన్‌ను రెడ్‌క్రాస్‌సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. హరినారపరెడ్డి, టీమ్స్ సేవియర్స్ ప్రణీత్, రెడ్‌క్రాస్ మేనేజర్ ప్రసాద్, టీమ్‌సేవియర్స్ సభ్యులు, రెడ్‌క్రాస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ



**కావలిరూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కావలిపట్టణ నివాసులు బండారువంశీ తండ్రిగారైన బండారు వెంకయ్య జ్ఞాపకార్థం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్రద్వారా ఆదివారం కావలిపట్టణం తుఫాన్‌నగర్‌లోని జంగాలకాలనీలోని పేదలకు భోజనంప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. తమసంస్థద్వారా పేదలకు ఆకలితీర్చిన దాత బండారు వంశీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేశారు. వంశీతండ్రి బండారువెంకయ్య పవిత్రాత్మకు శాంతిచేకూరాలని కోరడం జరిగింది.

## రెండు లారీలు ఢీ.. ఒకరికి గాయాలు



గుడ్లూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త రెండు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని మోచర్ల వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. 16వ నెంబరు జాతీయ రహదారి మోచర్ల వద్ద లారీని వెనుక వైపు ధాన్యంతో వెల్తున్న మరొక లారీ ఆదివారం తెల్లవారుజామున ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం లో కావలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుడ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కావలిలో రౌడీయిజం చేస్తే కఠినచర్యలు తప్పవు..!



**కావలి, నవంబర్ 1 ప్రభాతవార్త** కావలిలో రౌడీయిజం చేసి ప్రశాంత వాతావరణానికి భంగంకలిగిస్తే కఠినచర్యలు తప్పవని కావలి డిఎస్పీ పి.శ్రీధర్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. కావలి పట్టణ రైల్వేరోడ్డులోని పోలీసుకమాండ్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. రౌడీషీటర్లు అల్లర్లు చేసినా, అలజడులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. చెడునడత కలిగిన రౌడాషీటర్లపై నిత్యం పోలీసునిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు ఏమాత్రం అవరోధం కల్పించినా పోలీసు ఉక్కుపాదం మోపుతుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రౌడీషీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత పోలీసుస్టేషన్లో సంతకాలు చేయాలన్నారు. బయటప్రాంతాలకు వెళ్లేసమయంలో పోలీసుస్టేషన్ అధికారి అనుమతి విధిగా పొందాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండ్‌ఓవర్ చేస్తామన్నారు. గంజాయి, మహిళలను వేధించడం, ప్రజలను ఇబ్బందిపెడితే పోలీసుచర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఎందుకు పనికిరానివారిగా పరిగణించాల్సి వస్తుందన్నారు. పిడియాక్ట్ ఎంతో బలంగా ఉందన్నారు. సద్భావనతో మంచిగా ఉంటే రౌడీషీట్లను తీసివేస్తామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కావలి ప్రశాంత వాతావరణంలో పయనించేలా పోలీసులు చర్యలు చేపడుతున్నామన్నారు. కావలి పట్టణ, టూటౌన్, రూరల్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. 2వపట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు, రూరల్ సిఐ రాజేశ్వరరావు,యస్‌ఐలు సుమన్,తిరుమలరెడ్డి,బాజీబాబు, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై విమర్శలు అభివృద్ధిని అడ్డుకోవడమే - మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి



**ఉదయగిరి, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ పీఏలపై బురదచల్లుడు వ్యాఖ్యలు విమర్శలు చేయడం ఎన్నడూలేని అభివృద్ధిని అడ్డుకోవడమేనన్న మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీ వాసులతో కలిసి విలేకర్లతో మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, మట్ల రామయ్య లక్ష్మయ్య, అంకయ్య మాట్లాడుతూ ఇటీవల ఆనకట్ట ఆధునీకరణ పనులపై వెల్లువెత్తిన వదంతులను నమ్మి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పీఏలపై గిట్టని వ్యక్తులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని వెనుకబడిన మెట్ట ప్రాంతం అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఈ పరిణామాలు గుర్తించాలని లేనిపోని అవాస్తవాలను నమ్మవద్దని ఆమె కోరారు. గత ప్రభుత్వంలో స్థానిక ట్యాంక్‌బండ్ ఆధునీకరణ పనులు మంజూరు అయ్యాయని ఆ విషయం నియోజకవర్గ ప్రజలందరికి తెలుసునని, ఈ పనుల పూర్వపరాలు గుర్తించి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. నూతన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే అనుభవం లేకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరగవచ్చని అందుకే పనులు తొందరగా పూర్తి అయి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే కాంక్షతో పాత కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించారన్నారు. ఇందులో ఎలాంటి స్వార్థం లేదని, అది ప్రత్యేకంగా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీపై బురదజల్లే మిత్రులు కూడా గమనించాలని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ప్రజల పక్షానే ఉంటుందని గత ప్రభుత్వం లాగా స్వార్థం చూసుకుని పనులు మధ్యలో ఆపి మరొకరికి అప్పజెప్పదని ప్రజలకు మంచి జరగాలని కోరుకోవడమే తప్ప మిగతా ఆలోచన మన పార్టీకి కానీ, మన శాసనసభ్యులకు లేదని వారు అన్నారు. కొందరు పనిగట్టుకొని శాసనసభ్యులు కాకర్ల సురేష్ పీఏలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ఈ ప్రాంతానికి మంచి చేద్దామన్న ఉద్దేశంతో మాత్రమే వచ్చారని అంతే కాని ఆయన స్థాయికి వీరు అనుకుంటున్న వదంతులు దిగజారుడు తనమే అవుతుందని గుర్తించాలని అన్నారు. ఈ విషయం రాజకీయాలకు అతీతంగా అందరూ గ్రహించాలని తెలుగుదేశం కుటుంబ సభ్యులు ఇలాంటి వార్తలు పట్టించుకోవద్దని ఆమె తెలిపారు. వదంతులు ఊరికే రావని వాటిపై పార్టీ అధిష్టానం సమగ్ర విచారణ జరుగుతుందని, ఈ వదంతుల్లో పార్టీకి సంబంధించిన వారైనా సరే ఉన్నారని రుజువైతే పార్టీ నుంచి బహిష్కరించేందుకు కూడా అధిష్టానం సిద్ధమవుతుందని ఆమె హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసమే కాకర్ల సురేష్‌ను శాసనసభ్యులుగా ఎన్నుకున్నారని, రాబోయే ఐదు సంవత్సరాలలో నియోజకవర్గాన్ని ఎలా తయారు చేయాలన్న విజన్ ఉన్న నాయకుడు మన శాసనసభ్యులు కాకర్ల సురేష్ అని ఆయనకు మద్దతు ఇచ్చి అభివీద్ధికి సహకరించి మన ప్రాంతాన్ని బాగు చేసుకునే బాధ్యత తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులతో పాటు అందరికి ఉందని, ఈ విషయం గుర్తించాలని ఆమె కోరారు. పార్టీలోనే ఉంటూ పార్టీపై, శాసనసభ్యులుపై బురద చల్లే వారు ఎవరైనా సరే వదిలిపెట్టేది లేదని మరొకసారి ఆమె హెచ్చరించారు. మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, మట్ల రామయ్య, మట్ల లక్ష్మయ్య, అల్లూరయ్య, ఎస్టీ కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి నాట్లు



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా ఇటీవల కాలంలో వరినాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యవసాయం సాగుకు ఖర్చులు తడిచి మోపిడి కావడంతో వారి పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. ప్రస్తుతం మండలంలోని పలు ప్రాంతాల్లో బోర్ల కింద సేద్యం చేసే రైతులు వరినాట్లు ప్రారంభించారు. తీరా ప్రస్తుతం ఈ ఫెంగల్ తుఫాన్ కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి పలు కాలనీల్లోని రహదారులు పూర్తిగా జలమయమయ్యి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

## గాడితప్పిన అనంతసాగరం మండల సచివాలయ వ్యవస్థ నిద్ర మత్తులో సచివాలయం డిడిఒలు సమయపాలన పాటించని సచివాలయం సిబ్బంది




**అనంతసాగరం, డిసెంబర్1, ప్రభాతవార్త:** అనంతసాగరం మండలంలో 16 సచివాలయా లున్నాయి. సచివాలయానికి 14మంది సిబ్బంది ఉన్నారు. మండల ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు 2వేల జనాభా పైగా ఉన్న గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఇచ్చే అర్జీలు స్వీకరించి పరిష్కరించాలి . మండలంలో సచివాలయాల్లో ఉద్యోగులు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. సచివాలయాల్లో డిడిఒలు పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. సాయంత్రం 5గంటల వరకు ఉండాల్సిన ఉద్యోగులు నాలుగు గంటలకే వెళ్ళిపోతున్నారు. దీనికి కారణం డిడిఒల పర్యవేక్షణ లేకపోవడమేఅని తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1వ తేదీ ఆదివారం వస్తుందని తెలుస్తుండడంతో ముందుగానే పెన్షన్ల కార్యక్రమం చేపట్టింది. అయితే కొంతమంది సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం వరకే వచ్చి వెళ్ళిపోతున్నారు. సాయంత్రం 6వరకు పెన్షన్ల కార్యక్రమం ఉన్నా ముందుగా వెళ్ళిపోవడం కారణమేదో తెలి యడం లేదు. డిడిఒలు మొద్దు నిద్రలో ఉండడమే దీనికి నిదర్శనమని ప్రజలు బాహాటంగా చర్చించు కుంటున్నారు. మండలాధికారులు ప్రతి సచివాలయాన్ని సందర్శిస్తే నిజనిజాలు బయటకి వస్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థలో మార్పు వస్తుందని ప్రజలు ఆశపడ్డారు. అయితే ఈ పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. సిచవాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదు. సచివాలయ వ్యవస్థ పనిచేస్తుందా లేదా ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. దీన్నిబట్టిచూస్తే మండలంలో సచివాలయ వ్యవస్థ గాడితప్పినట్లు కనిస్తున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

## మాజీ ఎంపీపీ మృతి



**గుడ్లూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త** గుడ్లూరు మండలంలోని పూరేటిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఒంగోలు మాలకొండయ్య(65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పూరేటపల్లి గ్రామానికి చెందిన ఒంగోలు మాలకొండయ్య టీడీపీ తరుపున ఎంపీపీగా పనిచేశారు.

## పీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



**సైదాపురం, డిసెంబర్ 1, ప్రభాతవార్త** అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన సైదాపురం మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని వెంకటగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గులించర్ల గ్రామానికి చెందిన స్వర్ణ శ్రీహరిరెడ్డి చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుని భార్య అయిన స్వర్ణ రత్నమ్మకు రూ.2లక్షల 48వేల 513ల చెక్కును ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన రామసాగరం గ్రామానికి చెందిన ఆలం లీలావతికి రూ.1.50లక్షలు, పనసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అధోనపు శ్రీనివాసులుకు రూ.2లక్షలు చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా లబ్ది పొందిన బాధితులు, మండల స్థాయి నాయకులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట మండల టీడీపీ ఉపాధ్యక్షులు నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

## పీహెచ్‌పీ అసోసియేషన్‌కి ప్రశంసా పత్రం అందించిన డీఎంహెచ్‌ఓ



**నెల్లూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి ప్రశంసా పత్రం, మెమోంటో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య, డీఎల్ఓ డాక్టర్ షేక్ ఖాదర్ వల్లి చేతుల మీదుగా టౌన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ అందుకున్నాడు. మొదట ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో వీఆర్సీ నుండి మొదలై టౌన్ హాల్ వరకు సాగింది. ఈ ర్యాలీని పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టౌన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ 1999వ సంవత్సరం నుంచి పీఎంపీ, ఆర్ఎంపీ, గ్రామీణ వైద్యులు గ్రామాల్లో ప్రాథమిక వైద్యం చేస్తూ ప్రాణాంతక వ్యాధులు పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యపరుస్తున్నామని, దానిని గుర్తించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ప్రతి సంవత్సరం ప్రశంసా పత్రం, మెమోంటోను ప్రధానం చేస్తున్నారని, డీఎల్ఓ డాక్టర్ ఖాదర్ వల్లి నెల్లూరు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రతి యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, మండల హెడ్ కోర్టర్స్‌లో ఎయిడ్స్, లెప్రసీ, క్షయ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారని, ఆ కార్యక్రమాల్లో మా సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు కోలా రవీంద్రబాబు, పీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నాయకులు సీహెచ్ వీరయ్య, ఎన్.ప్రసాద్, యు.రామదాసు, నెల్లూరు సిటీలోని సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను నెరవేర్చాలి

**వింజమూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా కనీసం ఒక్క



పథకమైనా సక్రమంగా అమలు చేయకుండా గత ప్రభుత్వంపై అసత్య ప్రచారాలతో కాలం వెలిబుచ్చుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని ప్రచారం చేసుకొని నేడు అధికారంలోకి రాగానే మాటతప్పి విద్యుత్ చార్జీలను 6నెలల్లో రెండుసార్లు ప్రజలపై భారం మోపాడన్నారు. రాష్ట్ర ప్రజలపై సుమారు 15,486కోట్లు సర్‌చార్జీల భారం పడుతుందన్నారు. ప్రభుత్వ తీరుచూస్తే బాబు షూరిటీ - బాదుడు గారంటీ అనడమే సబబుగా ఉందన్నారు. గత వైఎస్ఆర్‌సిపి పాలన లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన సంస్కరణలతో లక్షల కోట్ల సంపద నేడు చంద్రబాబు పాలనలో ఆవిరైపోతుందన్నారు. ఇప్పటికే దారుణంగా నిత్యావసర సరుకుల ధరలు మండుతున్నాయన్నారు. విద్యార్థుల ఫీజు మోతలు ఇలా అనేక విధాలుగా ప్రజలపై ఈ ప్రభుత్వం భారం మోపిందన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ కన్వీనర్ మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, బయపురరెడ్డి విజయకృష్ణారెడ్డి, ఆనంగి శీనయ్య, పల్లాల ప్రసాద్, భోజనపు గోపి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దాదిబత్తిన శ్రీనివాసులురెడ్డి, చంగా సురేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు రొడ్డా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## కండలేరులో 53.664 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), డిసెంబరు1ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయానికి53.664 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 2150 క్యూసెక్కులు,వరదనీటి రూపేణా 4810 క్యూసెక్కుల చోప్పున మొత్తం 6960 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జళాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 915 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కులు చోప్పున మొత్తం 1095క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## ఫెంగల్ తుఫాన్ తో కార్యలయంలో రెవెన్యూ సిబ్బంది

**రాపూరు, డిసెంబరు1ప్రభాతవార్త** ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎవైనా ప్రమాదం జరుగుతుందేమే అన్న అనుమానంతో రాపూరు తహశిల్దార్ కార్యలయంలో రెవెన్యూ సిబ్బంది తుఫాన్ విదులు ఆధివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్‌ఆదేశాలతో తహశిల్దార్ పి.ఎల్.లక్ష్మీనరసింహం సూచనలతో రెవెన్యూ సిబ్బంది కార్యలయంలోనే వున్నారు. ఎప్పటికప్పుడు మండలంలోని వివిధ గ్రామాలలో తుపాన్ ప్రభావంతో ఎమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా, ఎక్కడైనా ముంపుకు గురయ్యే ప్రాంతాలు వున్నాయా అన్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

## పాములగుంటపాలెంలో అక్రమమద్యం విక్రయాలపై దాడులు

**కావలి, డిసెంబర్ 1 ప్రభాతవార్త** కావలిరూరల్‌మండలం చెన్నాయపాలెం పంచాయితీ పాములగుంట పాలెంలో చట్టవిరుద్ధంగా మద్యంవిక్రయాలు చేస్తున్న వారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.శ్రీనివాసులు, సిబ్బంది ఆకస్మికదాడులు నిర్వహించారు. పాములగుంటపాలెంలో పంతంగి వెంకటేశ్వర్లు వద్దఉన్న 13 మద్యంబాటిళ్లను స్వాధీనంచేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నారు. పిఅండ్ఈయస్ఐ దేవిక, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

## శ్రీఅన్నపూర్ణాంబాదేవి సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు

**ఇందుకూరుపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని మైపాడులో వెలసి ఉన్న శ్రీ అన్నపూర్ణాంబాదేవి సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక ఉంజల సేవ, కార్తీక దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీడీపీ యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారికి నిర్వహించిన విశేష పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని కార్తీక ద్వీపం వెలిగించి తీర్ధప్రసాదాలు స్వీకరించారు.



## ఆసన్నమవుతున్న పరీక్షల సమయం..వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత



### ప్రధాన సబ్జెక్టు లలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు బేంబేలు

**వరికుంటపాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రానికి శివారు మారుమూల ప్రాంతమైన వరికుంట పాడు మండలంలో అంతంత మాత్రంగానే విద్యావ్యవస్థ ముందుకు సాగుతుండగా కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎలాగోలా ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి అన్ని వసతులు కల్పిస్తున్నామని ఓ వైపు గొప్పలు పలుకుతుండగా వరికుండ పాడు మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో ప్రధాన సబ్జెక్టు టీచర్లు లేకపోవడం ఈ ప్రాంత విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పదవ తరగతి పరీక్షలు ముంచుకోస్తున్న తరుణంలో ప్రధాన సబ్జెక్టులు అయిన గణితం, ఇంగ్లీషు, ఫిజికల్ సెన్సు టీచర్లు లేకపోవడం దారుణం ,దీంతో విద్యార్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ప్రాంతంలో కనీసం ట్యూషన్లు చెప్పె వారు లేక పోవడంతో విద్యార్థులు సొంతంగా ఇళ్ల వద్ద కుస్తీలు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎందుకు ప్రభుత్వ పాఠశాలలకు పంపామని ఆందోళన పడుతున్నారు. వరికుంటపాడు మండలంలో మొత్తం 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో 243 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో అయితే ఏకంగా ప్రధానోపాధ్యాయుడు పోస్టుతో సహా ప్రధాన సబ్జెక్టు లెక్కలు 2 పోస్టులు, ఇంగ్లీష్ -1, పిఈటి -1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి .అయితే ఆ పాఠశాలలో లెక్కలు చెప్పే ఉపాధ్యాయుడే లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు టీసీలు ఇవ్వండి అంటూపాఠ శాలకు వెళ్తున్నారని ,అక్కడ ఉన్న ఉపాధ్యాయులు ఇదిగో వస్తారు, అదిగో వస్తారంటూ తల్లిదండ్రులకు నచ్చచెప్పున్నారు. అయితే విద్యాసంవత్సరం పూర్తి అవుతున్న అక్కడ గణితం బోధించే వారు లేక పోవడం విశేషం... అలాగే జడదేవి ఉన్నత పాఠశాలలో అయితే ఇంగ్లీష్ -2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి .అలాగే అక్కడ లెక్కలు -1, ఫిజిక్స్ -1, పిఈటి -1 తో పాటు ప్రధానోపాధ్యాయుడు పోస్టులు ఖాళీ గా ఉన్నాయి. ఇంగ్లీష్ చదువుల కోసం పరుగులు పెడుతున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడే లేక పోవడం సాగుతున్న చదువులను ఎండగట్టవచ్చు, అలాగే కాకోల్లువారిపల్లి లో గణితం -2, తెలుగు -1 ఖాళీలు ఉన్నాయి. తూర్పు రొంపిదొడ్ల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, గణితం -1, ఫిజిక్స్ -1, సోషల్ -1 ఉపాధ్యాయుల కొరత ఉంది ఇలా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థులు పరీక్షలు ఎలా గట్టేక్కాలనే సందిగ్దంలో భాధపడుతున్నారు. ఇదే పరిస్థితి ఉంటే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. ఇటీవల ప్రభుత్వం వర్కు అడ్జెస్ట్ మెంట్‌లో ఉపాధ్యాయులను నియమించిన అందులో కూడా అధికారులు వరికుంట పాడు మండలానికి తీవ్ర అన్యాయం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు అస్సలు లేని చోట సర్దుబాటు చేయకుండా తమ ఇస్టానుసారంగా బదిలీలు చేశారని బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇప్పటికైన పదవ తరగతి పరీక్షలు సమయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన సబ్జెక్టుల్లో టీచర్ల నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతం నుండి అనేక మంది విద్యార్థులు పది పరీక్షల్లో 10 కి 10 పాయింట్లు సాధించిన వారు ఉన్నారని, కానీ ఉన్నతాధికారులు ఈ మెట్ట ప్రాంతం పై చిన్న చూపు చూస్తున్నారనీ ,వారి నిర్లక్ష్యంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో నుండి ప్రవేటు పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు సంఖ్య అధికమవుతున్నది. కాబట్టి జిల్లా అధికారులు స్పందించి ఉపాధ్యాయుల కొరతను తీర్చి ,తమ విద్యార్థుల జీవితాలను కాపాడాలని తల్లిదండ్రులు కోరుచున్నారు.

## హోరెత్తిన ఆర్యవైశ్య మిత్రమండలి వనభోజన మహోత్సవం..!





**కావలి, డిసెంబర్ 1 ప్రభాతవార్త** కావలిపట్టణంలో నూతనంగా ఆవిర్భవించిన ఆర్యవైశ్యమిత్రమండలి ఆధ్వర్యంలో కావలి శివాలయంవీధిలోని కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన వనభోజన మహోత్సవంలో మహిళలతో కిక్కిరిసిపోయింది. దాదాపు వెయ్యిమంది పైచిలుకు మహిళలు, ప్రముఖులతో ఈ వనభోజన మహోత్సవంఅలరాలింది. మహిళలు కోలాటనృత్యాలు, చిన్నారుల నృత్యప్రదర్శనలు హోరెత్తాయి. పెద్దఎత్తున పట్టణంలోని మహిళలు తరలి వచ్చి పాల్గొనడంతో పెద్ద చర్చనీయాంశమే అయింది. ఆర్యవైశ్య మిత్రమండలి సీనియర్ టిడిపినేత వాయిగండ్ల వెంకటేశ్వరరావు, చవల మురళికృష్ణ, చవల రమేష్‌చంద్ర, కుదవసంఘం అధ్యక్షుడు కోట రమేష్, తదితరుల నాయకత్వంలో వనభోజన మహోత్సవం అదిరింది. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్యకార్పొరేషన్ డైరక్టర్ తటవర్తివాసు, ఏరియావైద్యశాల డైరక్టర్ చవల రామకృష్ణ, మాజీ ఏఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, బిజెపి కావలినియోజకవర్గ కన్వీనర్ సివిసి సత్యం, అరుణోదయ వస్త్రమార్కెట్



అధ్యక్షులు చన్నా సత్యనారాయణ, బృందావనం హౌసింగ్‌కాలనీ ఉపాధ్యక్షులు రాజారమణయ్య, విట్స్ ప్రొఫెసర్, ఆర్యవైశ్యసంఘం ప్రోగ్రామ్ కన్వీనర్ వేముల సునీల్, టిడిపి నేతలు గాదంశెట్టి వేణుగోపాల్, ఏల్చూరి రవి, అమరా నాగేశ్వరావు, పెటుగాని రమేష్, వాసవివనితా లెజండ్స్ జిల్లాఛైర్మన్ అనుమాలశెట్టి కామాక్షి, కావలి అధ్యక్షురాలు దుగ్గిశెట్టి హేమలత, భజనమండలి మహిళానేతలు పాల్గొని మాట్లాడారు. జ్యోతిప్రజ్వలనంగావించారు. ఈ సందర్భంగా వేదికనలంకరించిన ఆర్యవైశ్యనేతలు మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అత్యవసరపనిమీద హైదరాబాద్‌కు వెళారన్నారు. లేకుంటే ఈ వనమహోత్సవానికి విచ్చేసి అందరికి వనమహోత్సవ శుభాకాంక్షలు చెప్పేవారన్నారు. విజయవంతమైన ఈ వనమహోత్సవ కార్యక్రమానికి ఫోన్‌ద్వారా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియచేశారని తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అండగాఉన్నారన్నారు. ఆర్యవైశ్యులంతా ఒకేతాటిపై నిలబడాలన్నారు. వరాన్నిసైతం లెక్కచేయకుండా ఇంతపెద్దఎత్తున మహిళలు తరలిరావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ మహిళలందరూ ఎంతో ఆనందంగా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా ప్రశంసనీయమన్నారు. నిత్యం వంటింటికే పరిమితమౌతున్న మహిళలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని కొంత ఆనందంగా గడపవచ్చునన్నారు. ఆర్యవైశ్య మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. మరీముఖ్యంగా ఆర్యవైశ్యమిత్రమండలి నిర్వాహకులకుఅందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువాటిని నిర్వహించి బహుమతులు అందచేశారు. మహిళానేతలను దుశ్శాలువాలతో సత్కరించారు. వెయ్యిమందిపైచిలుకు ఆర్యవైశ్యులు భోజనకార్యక్రమాల్లోపాల్గొన్నారు. బంగారు, కుదవసంఘం కుటుంబసభ్యులు, పట్టణంలోని వివిధ రంగాలకు చెందిన ఆర్యవైశ్యప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు.

## ఘనంగా టి.పి.ఓ దశయ్యకు ఆత్మీయ పదవి విరమణ సభ

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక విభాగం టౌన్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన కొత్తపల్లి దశయ్యను కమిషనర్ సూర్యతేజ, ఇతర విభాగాల అధికారులు ఘనంగాసత్కరించారు .ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు విధుల పట్ల దశయ్య కనబరిచిన క్రమశిక్షణను అధికారులు,సిబ్బంది ప్రశంసించి,పదవీ విరమణ శుభాకాంక్షలను తెలియజేశారు. ఆత్మీయ పదవి విరమణవేడుకల్లో అదనపుకమిషనర్‌నందన్, ఆర్.డి.టి.వో మధుసూదన్, ఇంజనీరింగ్ ఎస్.ఈ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిసిపి పద్మజ, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చక్రపాణి, శీనయ్య, లైసెన్సు టెక్నికల్ పర్సన్స్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామ సుభిక్షం కోరకే దేవి మూల మంత్రహోమాలు



**కలువాయి డిసెంబర్ 1 ప్రభాతవార్త** గ్రామశక్తి స్వరూపిణి శ్రీకలువాయమ్మ అమ్మవారి దేవస్దానం నందు ప్రతి మాసం అమావస్యనాడు దేవి మూల మంత్రహోమాలు నిర్వహించడం జరగుతుంది. ఇందు లో భాగంగా ఆదివారం అమావస్య సందర్భంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో భాగంగా శ్రీమహాగణపతి, నవగ్రహ, అపమృత్యు గ్రామదేవత, మహాలక్ష్మీ దేవతల మూల మంత్ర హోమాలు నిర్వహించడం జరిగింది. యజ్ఞేశ్వరునికి పూర్ణాహుతి సమర్పించిన అనంతరం కార్యక్రమంలో పాల్గోన్న భక్తులు హోమ సామాగ్రిని హోమం నందు సమర్పించి దర్శించుకున్నారు. అనంతరం శ్రీకలువాయమ్మ ,గంగమ్మ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తల ఆదర్వ్యంలో మధ్యహ్నాం దేవస్దానం నందు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈకార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆత్మకూరు రామకృష్ణయ్య, సావిత్రమ్మ దంపతులు వారి కుటుంబసభ్యులు వ్యవహారించారు.

## బస్సులపై రవాణా శాఖ దాడులు

**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రైవేట్ టౌన్ బస్సులపై రవాణా శాఖ ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నిబంధనలు విరుద్ధంగా తిరుగుతున్న రెండు టౌన్ బస్సులను, రెండు ఆటోలు, ఒక కారును సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ వాహనాలను కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



## వరల్డ్ పొల్యూషన్ డే!

**నెల్లూరు క్రైమ్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** భూ వాతావరణంలో మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు కాలుష్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది వరల్డ్ పొల్యూషన్ డే సందర్భంగా వ్యక్తిగతంగా అందరూ ఉద్గారాల నియంత్రణ కొరకు తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. ఇందు కొరకు మారుతీ నెక్సా కార్లలో సిఎన్జి సాంకేతికతను మరియు హైబ్రిడ్ సాంకేతికతను ఉపయోగించి ఆధునిక భారత పొల్యూషన్ ప్రమాణాలలో వాహనాలను రూపొందిస్తోంది. దీనిని ఉపయోగించుకోవడం ద్వారా గరిష్ట మైలేజ్‌ను పొందడమే కాకుండా ఇంధనాన్ని పొదుపు చేయవచ్చు. నెల్లూరు తిరుపతి చిత్తూరు జిల్లాల ప్రజలు ప్రత్యేకమైన డిస్కౌంట్ ఆఫర్లలో వాహనాలను కొనుగోలు చేసుకుని లాభం పొందే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని భార్గవి ఆటోమొబైల్స్ ధూర్జటి చెంచు వెంకట వర ప్రసాద్ రావు , లక్ష్మణ రాజు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.

## హిందూ ధర్మం సనాతనం, నిత్యనూతనం





**బుచ్చి డిసెంబర్ 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన హిందూ సమ్మేళనంలో పాల్గోన్న సంగం తిరమనకొండపై కొలువైవున్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీ రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠం పీఠాదిపతులు రాజరాజేశ్వరానందస్వామి ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ధర్మ పరిరక్షణ కోసం నేడు అందరు కలిసి ఉంటే ధర్మం సనాతనం, నిత్య నూతనం అవుతుందని తెలిపారు. అలాగే ముఖ్య అతిధిగా పాల్గోన్న యుగందర్ మాట్లాడుతు ఈరోజు ధర్మం, దేశాన్ని కాపాడేదే దేవాలయం, అని అన్నారు. నేడు దేవాయాలలో అన్యమతస్తులు ఎక్కువ అయిపోయారని వారిని తొలగించాలని అన్నారు. దేవాలయంలో భజనలు, కీర్తనలు, ధర్మ ప్రసంగాలు జరగాలి, ప్రతి కుటుంబం వారంలో ఒక్కసారి అయినా కుటుంబంతో కలిసి గుడికి వెళ్లాలని సూచించారు. మనదీక్ష దేవాలయ రక్ష అనే నినాదంతో జనవరి 5 వ తేది విజయవాడలో జరిగే సమ్మేళనంలో మనమందరం కలిసి పాల్గోనాలని, ఈకార్యక్రమంలో స్దానిక మహిళలు, పెద్దలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర గోరక్ష ప్రముఖ శశి, కేతరాజు కేశవయ్య, వెంకట్‌నాద్, హైందవ శంఖారావం సహా కన్వీనర్ కనిగెలుపుల గిరి పాల్గోన్నారు.

## తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా రికార్డుకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో ముందుకు సాగకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎస్సై ఖాదర్‌బాషా హెచ్చరించారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రౌడీ మేళా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ కారణాల మూలంగా ఇటువంటి ముద్ర పడిన వారు తమ తీరును మార్చుకుని సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. లేనిపక్షంలో అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.